క్లుప్తంగా

ఓటు వేసే విధానంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

గంభీరావుపేట: ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును ఏ విధంగా వినియోగించుకోవాలో అవగాహన కల్పించేందుకు అధికారులు సంచార ప్రదర్శన వాహనాన్ని ఏర్పాటు చేశారు. మండలంలోని ముస్తఫానగర్ గ్రామంలో ఓటర్లకు ఓటు హక్కు వినియోగంపై ప్రదర్శన ద్వారా సోమవారం అవగాహన కల్పించారు. ఏ విధంగా ఓటు వేస్తే చెల్లుబాటు అవుతుందో, ఏ విధంగా ఓటు వేయకూడదో వివరించారు.

వార్డులను విడదీయొద్దు



నిరసన తెలుపుతున్న వార్డు ప్రజలు

ఇల్లంతకుంట: రేపాక గ్రామానికి చెందిన 4, 5 వార్డులను నూతనంగా ఏర్పాటు చేసే తాళ్లపల్లి పంచాయతీలో కలపొద్దని రేపాక 4, 5వార్డుల ప్రజలు సోమవారం మండల పరిషత్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు బ్యాంకు రాజకీయం కోసం కొందరు రాజకీయ నాయకులు దళిత బహుజన వార్డులను తాళ్లపల్లిలో కలపాలని చూస్తున్నారని, అగ్రవర్గాల కుట్రలకు ప్రజలను బలిచేయొద్దన్నారు. అనంతరం ఎంపీడీవో, తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాత మల్లేశం, మాజీ ఎంపీటీసీ రాజశేఖర్, కోదాని దిలీప్, రాజయ్య, శ్రీకాంత్, శివ, శ్రీతేజ, విజయకాంత్, సురేశ్, రోహిత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలుసుకున్న అధికారులు



ఎమ్మెల్యేను పూలమొక్క ఇస్తున్న వీటీడీఏ కార్యదర్శి సమ్మయ్య

వేములవాడ: ఇటీవల బదిలీపై వచ్చిన వీటీడీఏ కార్యదర్శి సమ్మయ్య, రుద్రంగి తహసీల్దారు శ్రీలత, చందుర్తి తహసీల్దారు శ్రీనివాస్ సోమవారం ఎమ్మెల్యే రమేశ్‌బాబును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ మాధవి, సెస్ డైరెక్టర్ నామాల ఉమ పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం



హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న ఎంపీపీ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అల్మాస్‌పూర్‌లో ఎంపీపీ నిధులతో ఏర్పాటు చేసిన మూడు హైమాస్ట్ లైట్లను ఎంపీపీ పిల్లి రేణుక సోమవారం ప్రారంభించారు. మంజూరుకు కృషి చేసిన మంత్రి కేటీఆర్‌కు ఎంపీపీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాధారపు పుష్పల, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు.. ప్రారంభానికి సిద్ధం

- నేడు మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభం

వేములవాడఅర్బన్: దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి ముఖద్వారంగా ఉన్న నందికమాన్ జంక్షన్‌ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. వీటితో పాటు పలు అభివృద్ధి పనులను మంగళవారం మంత్రి కేటీఆర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు ప్రారంభించనున్నారు.

నందికమాన్ జంక్షన్

వేములవాడ నందికమాన్ జంక్షన్‌ను రూ.1.27 కోట్లతో నిర్మించారు. వేములవాడ రాజన్న ఆలయం వైపు చూస్తున్న నందిపై గోపురం ఏర్పాటు చేశారు. చుట్టూ త్రిశులాలు, ముఖద్వారం ఇరువైపులా నెమళ్లు, వివిధ విగ్రహాలు, రంగు రంగుల విద్యుత్ దీపాల మధ్య ఫౌంటేన్ ఏర్పాటు చేశారు.

నిరుపేదలకు ఇళ్లు..

వేములవాడ మండలం చింతాల్‌ఠాణా గ్రామం పక్కన కోతులకాలనీ వాసులకు రూ.2.20 కోట్లతో 42 డబుల్‌బెడ్ రూం ఇళ్లు నిర్మించారు. ప్రభుత్వం గూడులేని నిరుపేదలకు ఇన్నాళ్లకు వారి కలను సాకారం చేయనుంది.



నిరుపేదల డబుల్ బెడ్రూం ఇళ్లు

ఏరియా ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్..

వేములవాడ ఏరియా ఆసుపత్రిలో ఇప్పటికే అత్యాధునిక వైద్యసేవలు అందుతున్నాయి. ఆసుపత్రిలో రూ.1 కోటితో ఐదు బెడ్‌లతో కూడిన డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశారు. అలాగే మాతృ సేవా సెంటర్, పిల్లల వార్డును కూడా ప్రారంభిస్తారు.

బయోగ్యాస్ విద్యుత్ ప్లాంట్..

వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని రాజన్న గోశాల ఆవరణలో వేములవాడ మున్సిపల్ ఆధ్వర్యంలో ఆవు, కోడెల పేడ ఆధారిత బయోగ్యాస్ ఎలక్ట్రికల్ ప్లాంట్ నిర్మించారు. దీనికి రాజన్న ఆలయం నిధులు రూ.31.60 లక్షలు వెచ్చించారు. ప్లాంట్‌లో బయోగ్యాస్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు రోజుకు 2.5 టన్నుల పశువుల పేడను వినియోగించనున్నారు. ఈ ప్లాంట్ నుంచి ఉత్పత్తయ్యే పర్యావరణ హిత గ్రీన్ ఎనర్జీ విద్యుత్‌ను గోశాలను ఆనుకుని ఉన్న ఏరియా ఆసుపత్రితో పాటు ఆలయ ఎలక్ట్రిసిటీ అవసరాలను తీర్చనున్నారు.



వేములవాడ నందికమాన్ జంక్షన్

సమీకృత మార్కెట్ భవనం

వేములవాడ పట్టణంలోని భగవంతరావునగర్‌లో పట్టణ ప్రజలకు, రైతులకు, వ్యాపారులకు అందుబాటులో ఉండేందుకు రూ.2.70 కోట్లతో సమీకృత మార్కెట్ భవనం నిర్మించారు. ఇందులో 102 మంది ఒకేసారి కూర్చుని వ్యాపారం చేసుకునేలా స్టాల్స్ ఏర్పాటు చేశారు.

మూలవాగు బండ్

వేములవాడ పట్టణం ప్రజలతో పాటు రాజన్న సన్నిధికి వచ్చే భక్తులకు ఆహ్లాదకరాన్ని పంచేలా మూలవాగు ఒడ్డున 330 మీటర్ల పొడవుతో మూలవాగు బండ్‌ను రూ.98 లక్షలతో ఏర్పాటు చేశారు.

బడిబస్సు భద్రత ప్రధానం

- సీసీ కెమెరాలు బిగించాలి



మాట్లాడుతున్న సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి

సిరిసిల్లక్రైం: స్కూల్ బస్సుల భద్రత అవసరమని సిరిసిల్ల, వేములవాడ డీఎస్పీలు ఉదయ్‌రెడ్డి, నాగేంద్రచారి పేర్కొన్నారు. సిరిసిల్లలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ప్రైవేటు విద్యాసంస్థల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ప్రతి పాఠశాల, బస్‌లలో సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల దృష్ట్యా బస్సు డ్రైవర్లకు ట్రాఫిక్, రోడ్డు సేఫ్టీపై అవగాహన ఉండాలని పేర్కొన్నారు. బడిబస్సుకు అన్ని వాహన పత్రాలు కల్గి ఉండాలని, బస్సు సరైన కండిషన్‌లో ఉందో లేదో ముందే చూసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో మద్యం తాగి డ్రైవింగ్ చేయొద్దని సూచించారు. ఏదేని ప్రమాదం జరిగితే సంబంధిత పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలకు వెళ్తామని హెచ్చరించారు. ఎల్లారెడ్డిపేట సీఐ శశిధర్‌రెడ్డి, వేములవాడ సీఐ కరుణాకర్, కృష్ణకుమార్, సిరిసిల్ల ఎస్సై ఎల్లాగౌడ్, ట్రాఫిక్ ఎస్సై రాజు పాల్గొన్నారు.

కొంపముంచిన 9వ ప్యాకేజీ పనులు

- వరద ఉధృతికి కొట్టుకుపోయిన పొలం
- ఆదుకోవాలని అన్నదాత వేడుకోలు

ఎల్లారెడ్డిపేట: అర్ధంతరంగా నిలిపివేసిన కాళేశ్వరం 9వ ప్యాకేజీ పనులు ఓ రైతును నిండా ముంచాయి. ఇటీవల కురిసిన భారీ వర్షానికి వచ్చిన వరద ఉధృతికి అర ఎకరం పొలం కొట్టుకుపోయింది. పొలంలో నిలువెత్తు కయ్యలు ఏర్పడ్డాయి. ఎల్లారెడ్డిపేట మండలం దుమాలకు చెందిన సల్మాల ఎల్లయ్యకు గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయం వద్ద రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. రాజన్నపేట నుంచి దుమాల మీదుగా 9వ ప్యాకేజీ కాలువ పనులు చేపట్టారు. రెండేళ్ల క్రితం కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. కాలువ పనులు అసంపూర్తిగా నిలిపివేయడంతో వర్షం నీరు పెద్ద ఎత్తున చేరి పక్కనే ఉన్న ఎల్లయ్య పొలం నుంచి వరద పోయింది. వరద ఉధృతికి పంట కొట్టుకపోగా.. పొలంలో ఇసుకమేటలు వేశాయి. మరో వైపు మట్టి కొట్టుకుపోయి నిలువెత్తు కయ్యలు పడ్డాయి. గతేడాది రూ.3లక్షలు వెచ్చించి సిమెంట్‌తో రాతి గోడ నిర్మించినప్పటికీ నీటి ఉధృతికి కొట్టుకుపోయింది.



వరద ఉధృతికి కొట్టుకుపోయిన వరి పంట

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

తంగళ్లపల్లి: మండలంలో సోమవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మనగర్ గ్రామపంచాయతీ పరిధిలో చేనేత కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం అధ్యక్షుడు మోర శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి కుమ్మరికుంట శ్రీహరి, ఉపాధ్యక్షుడు సామల శ్రీనివాస్, కోశాధికారి అన్నల్దాస్ చంద్రశేఖర్, నాయకులు మోర నర్సయ్య, తేళ్ల బాలనారాయణ, మల్లేశం, నారాయణ, బాలకిషన్, కిరణ్ పాల్గొన్నారు.



తంగళ్లపల్లి: చేనేత కార్మికులకు సన్మానం

హైదరాబాద్ తరలిన నేతన్నలు

బోయినపల్లి: హైదరాబాద్‌లో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ చేనేత దినోత్సవం కార్యక్రమానికి సోమవారం మండల పద్మశాలి సమాజ సేవా సంఘం నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బిల్ల మల్లేశంతో పాటు సంఘ నాయకులు ఉన్నారు.

ఒక్క ప్రమోషన్.. మూడు పోస్టింగ్‌లు

- పది రోజుల్లో మూడు పోస్టింగ్‌ల ఆర్డర్లు
- జిల్లా భూసేకరణ ప్రత్యేక కలెక్టర్‌గా గంగయ్య



గంగయ్య, ఎస్‌డీసీ, భూసేకరణ

సిరిసిల్ల: కలెక్టరేట్‌లో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా సుదీర్ఘకాలంపాటు పనిచేసిన బొద్దుల గంగయ్య పోస్టింగ్ మళ్లీ మారింది. సీనియర్ తహసీల్దార్ హోదాలో కలెక్టరేట్‌లో ఏవోగా పనిచేసిన గంగయ్యకు డిప్యూటీ కలెక్టర్(ఆర్డీవో)గా పదోన్నతి లభించింది. ఆయన్ని తొలుత వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ ఈవోగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. మూడు రోజులకే మళ్లీ జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారిగా నియమించారు. అంతలోనే తాజాగా రాజన్న సిరిసిల్ల జిల్లా భూసేకరణ విభాగం ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా నియమిస్తూ సోమవారం ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ ఆదేశాలు జారీ చేశారు. తంగళ్లపల్లి తహసీల్దార్‌గా పనిచేసిన సదానందం డిప్యూటీ కలెక్టర్‌గా ప్రమోషన్ పొంది జిల్లా భూసేకరణ విభాగం ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఆయన్ని కరీంనగర్‌కు బదిలీ చేస్తూ.. ఆయన స్థానంలో గంగయ్యను నియమించారు. పది రోజుల వ్యవధిలో ఒక్క ప్రమోషన్ ఇచ్చి మూడు పోస్టింగులు ఇవ్వడం అధికార వర్గాల్లో చర్చనీయాంశమైంది.

రోడ్డెక్కిన జీపీ కార్మికులు



సిరిసిల్లటౌన్: 33 రోజులుగా జీపీ కార్మికులు నిరవధిక సమ్మె చేపడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం పట్టింపులేకుండా ఉండటాన్ని నిరసిస్తూ సోమవాం జిల్లా కేంద్రం ఎల్లమ్మ జంక్షన్‌లో మహా రాస్తారోకో నిర్వహించారు. సుమారు రెండుగంటల పాటు రాస్తారోకోతో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. టౌన్ సీఐ ఉపేందర్ వచ్చి ఆందోళన కారులతో మాట్లాడి విరమింపచేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మూశం రమేశ్, కోడం రమణ, అన్నల్‌దాస్ గణేశ్, మోర అజయ్, ఎలిగేటి రాజశేఖర్, సూరం పద్మ, బూర శ్రీనివాస్, రాజయ్య, బాబు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రోడ్డు సేఫ్టీ కమిటీలు



మాట్లాడుతున్న ఎస్సై మహేశ్

గంభీరావుపేట: ప్రమాదాల నివారణకు గ్రామాల్లో ఆరుగురు సభ్యులతో కూడిన రోడ్డు సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. లింగన్నపేట, ముచ్చర్ల, మల్లారెడ్డిపేట, రాజుపేట, కొత్తపల్లి, శ్రీగాధ, కోళ్లమద్ది, నర్మాల, దేశాయిపేట గ్రామాల రోడ్డు సేఫ్టీ కమిటీ సభ్యులతో సోమవారం లింగన్నపేట రైతు వేదికలో సమావేశం ఏర్పాటు చేశారు. సీపీఆర్, ఇతర ప్రమాద నివారణ చర్యల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సైతో పాటు వైద్యాధికారి వేణుగోపాల్, సీహెచ్‌వో రమేశ్, ఉపసర్పంచ్ దుబాసి రాజు, వీపీవో పర్షరాం పాల్గొన్నారు.

చేనేత, పవర్‌లూమ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్లఅర్బన్: చేనేత పవర్‌లూమ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చేనేత పవర్‌లూమ్ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పంతం రవి అన్నారు. పట్టణంలోని కార్మిక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ చేనేత దినోత్సవాలు జరుపుకోవడం కాదని, చేనేత పవర్‌లూమ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. బతుకమ్మ చీరలు, ప్రభుత్వ ఆర్డర్లకు రావాలసిన బిల్లులు రాక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మంత్రి కేటీఆర్ స్పందించి వెంటనే బిల్లులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్ఎస్ఐ యూనిట్లకు విద్యుత్ సబ్సిడీ నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అజ్జ వేణు పాల్గొన్నారు.

ఎస్సైగా ఎంపికైన యువకులకు సన్మానం



ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లికి చెందిన ఇద్దరు యువకులు అందె సతీశ్, పిట్ల దీపక్ ఎస్సై ఉద్యోగాలు సాధించడంతో వారిని సోమవారం గ్రామస్తులు సన్మానించారు. సర్పంచ్ సరోజన– దేవరెడ్డి, ఉపసర్పంచ్ పెంజర్ల దేవయ్య, నాయకులు అందె సురేష్, కొండ ఆంజనేయులుగౌడ్, ఎంపీటీసీ లాగాల శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కొండ రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు వినతిపత్రం

వేములవాడ: మున్సిపాలిటీలో గృహలక్ష్మి పథకం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ప్రారంభోత్సవం సందర్భంగా సోమవారం విలేకరుల సమావేశంలో పాత్రికేయులపై, నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్‌కు వినతిపత్రం సమర్పించారు.

సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్లఅర్బన్: రాష్ట్రంలో మాజీ సర్పంచుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ మాజీ సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు దేవయ్య అన్నారు. ప్రభుత్వం, మంత్రి కేటీఆర్ పట్టించుకోవడం లేదన్నారు. దీనికి నిరసనగా మంగళవారం నుంచి రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు వారు తెలిపారు.

పోడు భూములపై హక్కులివ్వాలి

సిరిసిల్లటౌన్: పోడు భూములపై వెంటనే హక్కులు కల్పించాలని లంబాడీల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సురేష్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం గిరిజన రైతులతో కలిసి సిరిసిల్ల కలెక్టరేట్ ముట్టడించి మాట్లాడారు. ఇప్పటికీ పోడు భూములపై తమకు పట్టాలు అందలేదన్నారు. ప్రభుత్వం ఇస్తామని హామీ ఇచ్చి నాలుగు నెలలు దాటిందన్నారు. భూముల్లో సాగు చేస్తుంటే ఫారెస్ట్ అధికారులు అడ్డుకుంటున్నారని ప్రభుత్వం ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. సమస్యలపై కలెక్టరేట్‌లో వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో నాయకులు లకావత్ ప్రమీల, పోడు భూమిదారులు, లంబాడిల ఐక్యవేదిక నాయకులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన గిరిజన రైతులు

జీపీ కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలి

వీర్నపల్లి: గుండెపోటుతో మృతిచెందిన మండల కేంద్రానికి చెందిన గ్రామ పంచాయితీ కార్మికుడు పసుల మల్లేశం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ పంచాయితీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య డిమాండ్ చేశారు. వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట్ ప్రధాన రహదారిపై మల్లేశం మృతదేహంతో ధర్నా చేశారు. ఆయన కుటుంబానికి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. మృతదేహంపై ఎర్ర జెండాను కప్పి ఎంపీటీసీ అరుణ్‌కుమార్‌తో పాటు కార్మికులు నివాళి అర్పించారు.



మృతదేహంతో ధర్నా చేస్తున్న కార్మికులు

సంక్షిప్త వార్తలు

ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి

ఇల్లంతకుంట: పదహారేళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న తమ ఉద్యోగాలను ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని రెండో ఏఎన్ఎంలు స్వరూప, సలీమ సుల్తానా, దేవకి, స్వప్న, సుమలత, రాజేశ్వరీ, రాజవ్వ, సుమతి సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్

ఇల్లంతకుంట: మండల తహసీల్దార్‌గా జావెద్ అహ్మద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ నరేందర్ బదిలీపై వెళ్లగా జావెద్ అహ్మద్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందిస్తానన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

ఇల్లంతకుంట: మండలంలోని తెనుగువానిపల్లి గ్రామంలో నూతనంగా రూ.4.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సెస్ డైరెక్టర్ రవిందర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ అనసూర్య, ఏఈ రాకేష్‌రెడ్డి, సెస్ ప్రతినిధి రాకేశ్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లిలో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సర్పంచ్ పాశం సరోజన సోమవారం పంపిణీ చేశారు. ఎంపీటీసీ ల్యాగల శ్రీనివాస్‌రెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు జబ్బారు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండల కేంద్రంలో పలువురు లబ్ధిదారులకు సోమవారం బీఆర్ఎస్ నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.

కమ్యూనిటీ హాల్‌కు ప్రొసీడింగ్ అందజేత

కోనరావుపేట: మండలం ధర్మారంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవన మిగులు పనులను పూర్తి చేసేందుకు రూ.2 లక్షల ప్రొసీడింగ్‌ను ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య సోమవారం సంఘ అధ్యక్షుడు లింగయ్యకు అందజేశారు.

పశువైద్య శిబిరానికి స్పందన

కోనరావుపేట: మండలంలోని పల్లిమక్త గ్రామంలో సోమవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని 136 పాడిపశువులకు గాలికుంటు వ్యాధి నివారణ కోసం టీకాలు వేశారు.

శివసేన పార్టీలో చేరిక

కోనరావుపేట: శివసేన పార్టీ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పల్లెర్ల శేఖర్ ఆధ్వర్యంలో పలువురు యువకులు విద్యార్థి విభాగంలో చేరారు. శివసేన జిల్లా విద్యార్థి విభాగం ప్రధానకార్యదర్శి ఆముద ఉదయ్‌యంద్ర, నాయకులు పాల్గొన్నారు.

నోట్‌బుక్కులు పంపిణీ

గంభీరావుపేట: మండలంలోని ముచ్చర్ల గ్రామంలోని 400 మంది విద్యార్థులకు వేవ్స్ ఫౌండేషన్ ప్రతినిధులు నోట్‌బుక్కులు పంపిణీ చేశారు.

బోయినపల్లి: మండలంలోని కోరెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చెన్నాడి మార్తాండరావు ట్రస్ట్ చైర్మన్ చెన్నాడి రాజ్యలక్ష్మి సోమవారం ఉచితంగా నోటుబుక్కులు పంపిణీ చేశారు. ఎంఈవో శ్రీనివాసదీక్షిత్, మాజీ ఎంపీపీ సత్తినేని భాగ్యలత, ఎంపీటీసీ డబ్బు సృజన పాల్గొన్నారు.

ఠాగూర్‌కు నివాళి

చందుర్తి: స్థానిక ప్రాథమిక పాఠశాలలో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. హెచ్ఎం విక్కుర్తి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సంతాపం

ముస్తాబాద్: ప్రమాదవశాత్తు మృతి చెందిన రిమ్స్ వైద్యుడు ప్రవీణ్‌కుమార్, ఆశ వర్కర్ పద్మకు పోతుగల్ పీహెచ్‌సీ సిబ్బంది సోమవారం నివాళి అర్పించారు.

పవర్ కట్

విద్యుత్ సరఫరాలో అంతరాయం

తంగళ్లపల్లి: మండలంలోని రామచంద్రాపూర్ 33కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని సెస్ ఏఈఈ స్రవంతి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని రామచంద్రాపూర్, చిన్నలింగాపూర్, జిల్లెల్ల, నర్సింహులపల్లె గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమాచారం

నేడు మండల సర్వసభ్య సమావేశం

వీర్నపల్లి: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఎంపీపీ మాలోత్ భూల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో నరేశ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అధికారులు ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరు కావాలన్నారు.

నియామకం

బీసీ విద్యార్థి సంఘం మహిళా విభాగం జిల్లా ఇన్‌చార్జిలుగా హరిప్రియ, శ్రీజ

సిరిసిల్లఅర్బన్: బీసీ విద్యార్థి సంఘం మహిళా విభాగం జిల్లా ఇన్‌చార్జిలుగా వడ్ల హరిప్రియ, మ్యాన శ్రీజను బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ రవిగౌడ్ నియమించారు. ఈ మేరకు నియమాక పత్రాలను అందజేశారు. మహిళా విభాగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని, విద్యార్థుల సమస్యలపై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్ బూత్ కమిటీ

తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్ల గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ బూత్ కమిటీలను సోమవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బూత్ కమిటీ అధ్యక్షులుగా బండి మల్లయ్య, బొల్గం సతీష్ గౌడ్, ఆకారపు రమేశ్, మాదారపు సత్తిరెడ్డి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పూర్మాని రాంలింగారెడ్డి, జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు, ఎంపీటీసీ చెన్నమనేని వెంకట్రావు, సింగిల్‌విండో చైర్మన్ కోడూరి భాస్కర్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



ఎల్లారెడ్డిపేటలో సమ్మె చేస్తున్న కార్మికులు

ఎల్లారెడ్డిపేట: తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని 33 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తూ తాత్కాలిక కార్మికులను పెట్టి తమ సమస్యలను పట్టించుకోవడం లేదని సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు రేసు రాజయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేటలో కార్మికులు చేస్తున్న సమ్మె 33 రోజులకు చేరింది. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ తమకు పోటీగా కార్మికులను పెట్టి పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జక్కుల మహేందర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నర్సయ్య, లక్ష్మి, శంకర్, రామవ్వ, రాజు, రమేశ్, రాములు, మంజుల పాల్గొన్నారు.

గుడిసెలు లేని పల్లెలు ప్రభుత్వ లక్ష్యం

ముస్తాబాద్: పేదలు ఆత్మగౌరవంతో జీవించేందుకు సీఎం కేసీఆర్ గొప్ప దార్శనికతతో గుడిసెలు లేని పల్లెలే లక్ష్యంగా పనిచేస్తున్నారని ఎంపీపీ జనగామ శరత్‌రావు అన్నారు. మండల పరిషత్‌లో విలేకరుల సమావేశంలో సోమవారం మాట్లాడారు. గృహలక్ష్మి పథకం ద్వారా పేదల సొంతింటి కలను నేరవేరుస్తున్నారన్నారు. ప్రతి గ్రామంలో గుడిసెల్లో జీవించే వారికి, అద్దె ఇళ్లలో ఉండేవారికి ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. అలాగే టేకేదారులకు సైతం ఆసరా పింఛన్లను మంజూరు చేసిందన్నారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం చారిత్రత్మకమన్నారు. జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్ రావు, కోఆప్షన్ సభ్యుడు షాదుల్ పాల్గొన్నారు.